ప్రజాశక్తి
శనివారం 28 అక్టోబర్ 2023
8 పేజీలు





విశాఖపట్నం
అనకాపల్లి

ప్రజా పోరాటాలతో..

పట్టణ సంస్కరణల భారాలను తిప్పికొట్టాలి

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సంస్కరణలు - పట్టణ ప్రజలపై పెను భారాలు' సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వాల పట్టణ సంస్కరణల భారాలను ప్రజా పోరాటాలతో తిప్పికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖ నగరంలోని డాబాగార్డెన్స్ దరి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సంస్కరణలు - పట్టణ ప్రజలపై పెనుభారాలు' అన్న అంశంపై రాష్ట్ర స్థాయి సెమినార్ జరిగింది. దీనికి ముఖ్య వక్తగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ అదానీకి లాభం చేకూర్చేందుకు విద్యుత్ మీటర్లను పట్టణాల్లో బిగించేందుకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తహతహలాడుతుందని అన్నారు. మురుగునీరు, డ్రైనేజీ ఛార్జీలతో పాటు ప్రజలకు కార్పొరేషన్లు అందించే ప్రతి సేవపైనా యూజర్ ఛార్జీలు వేసి నడ్డివిరిచే సంస్కరణలను సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. జగనన్న కాలనీల పేరుతో పట్టణాల్లో ఉన్నవారిని మారుమూలలకు విసిరేస్తున్నారని, అలాకాకుండా ఎక్కడ పేదలు నివాసం ఉంటారో అక్కడే పట్టాలివ్వాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు రుణం కూడా ప్రభుత్వం ఇప్పించాలన్నారు. రాష్ట్రంలో 32 లక్షల ఇళ్లంటూ ఆర్భాటం చేసిన వైసిపి సర్కారు నాలుగున్నరేళ్లలో పేదలకు చేసిందేంటని ప్రశ్నించారు. సిఎం జగన్ తన ఇల్లు కోసం రుషికొండపై ఆరు నెలల్లో అన్నీ సిద్ధం చేసుకుని, పేదలను మాత్రం వెనక్కి నెడతారా? అంటూ ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల భూములను అదానీ వంటి కార్పొరేట్లకు అప్పగించడం దారుణమన్నారు. ఇళ్ల పేరుతో పేదలను మారుమూలలకు తరిమేసే సంస్కరణలను వ్యతిరేకించాలన్నారు. గంగవరం మిగతా 2లో..



'మోడీ, జగన్ విధానాలు.. పట్టణ ప్రజలపై దాడి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న హీరోయిన్ శ్రీలీల

నగరంలో భగవంత్ కేసరి బృందం సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భగవంత్ కేసరి చిత్ర యూనిట్ శుక్రవారం విశాఖ నగరంలో సందడి చేసింది. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై నందమూరి బాలకృష్ణ హీరోగా, కాజల్, శ్రీలీల ప్రధాన తారాగణంగా తెరకెక్కిన భగవంత్ కేసరి మూవీ 'షేర్ కా టూర్'లో భాగంగా విశాఖ మెలోడీ థియేటర్‌లో ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపేందుకు ఆ సినిమా బృందం తరలివచ్చింది. ఈ సందర్భంగా మీడియాతో చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ తన రెగ్యులర్ జోనర్ దాటి బాలయ్యతో తీసిన ఈ సినిమాకి పెద్ద పేరు రావడం ఆనందంగా ఉందన్నారు. కథ విన్న వెంటనే ఇద్దరు అమ్మాయిలు తండ్రి అయిన బాలకృష్ణ ఓకే చేశారని తెలిపారు. ఈ చిత్రంలో బాలయ్య జీవించారని కొనియాడారు. యాక్షన్ సన్నివేశాలు బాగా వచ్చాయని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తీసిన సన్నివేశాలను అందరూ బాగా రిసీవ్ చేసుకున్నారని తెలిపారు. సినిమా సబ్జెక్ట్ ఆడపిల్లల తల్లిదండ్రులకు బాగా కనెక్ట్ అయ్యిందన్నారు. తనకు విశాఖతో ఎంతో మంచి అనుబంధం ఉందని, విశాఖలోనే అన్ని సినిమా కథలు రాసుకుంటానని గుర్తు చేసుకున్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ భగవంత్ కేసరి కంటెంట్ ఓరియంట్ సినిమా అని తెలిపారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమానన్నారు. వరుసగా మూడు సినిమాలు హిట్ కావడం తనకు చాలా ఆనందంగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిర్మాత సాహు గరపాటి మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకుల నమ్మకం మిగతా 2లో..

అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు

▶ వార్త 8లో..

మహిళా ఓటర్లే అధికం

▶ వార్త 2లో..

29న ప్రభుత్వ రంగ సంస్థల రక్షణపై సదస్సు

▶ వార్త 2లో..



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

గవర్నర్‌కు సాదర స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు విశాఖపట్నం విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. శనివారం ఆంధ్ర మెడికల్ కాలేజీలో జరగనున్న శతాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం సాయంత్రమే విశాఖకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా మిగతా 2లో..

ఘనంగా ఎఎంసి శతాబ్ది ఉత్సవాలు

◆ దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ వైద్య విద్యార్థులు ◆ నేడు ఉప రాష్ట్రపతి రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలోనే పురాతన వైద్య కళాశాలల్లో ఒకటైన ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఎఎంసి) శతాబ్ది ఉత్సవాలు ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. వర్చువల్ విధానంలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ హాజరయ్యారు. తొలుత ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఎంసికి ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. ఆంధ్ర వైద్యకళాశాల నుంచి వచ్చే వైద్యులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో కేంద్రం వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ తమ ధ్యేయమన్నారు. అనంతరం సెంటినరీ సెలబ్రేషన్స్ సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ముందుగా వైద్యులు, వైద్య విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాల్లో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి రమేశ్ కుమార్, మిగతా 2లో..



కళారూపాలతో ఆకట్టుకున్న పూర్వ విద్యార్థులు

మొదటి పేజీ తరువాయి..

పట్టణ సంస్కరణల భారాలను తిప్పికొట్టాలి

పోర్టును అదానీకి రాష్ట్ర ప్రభుత్వం ఎలా కట్టబెట్టిందో వివరించారు. విజయవాడ టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖలో స్మార్ట్‌సిటీ పేరుతో, విజయవాడలో వాటర్ మీటర్ల పేరుతో పాలకులు సరికొత్త ఎత్తుగడలకు దిగుతున్నారన్నారు. చెత్తకూ పన్ను వేస్తున్నారన్నారు. సేవలకు ఛార్జీలనే విధానం అత్యంత హేయమైనదన్నారు. రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు ఉండే అధికారాలు, నిధులన్నింటినీ అదానీ, ప్రైవేట్ సంస్థలు దిగమింగే సంస్కరణలను పాలకులు అమలు చేయడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్ల పట్టాలను పేదలకు రాష్ట్రంలో అరకొరగానే ఇస్తున్నారని తెలిపారు. నెల్లూరులో సిపిఎం పేదల కోసం పోరాడి 15 వేల ఇళ్ల స్థలాలు ఇప్పించిందన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గతంలో సంస్కరణల పేరుతో ప్రజల వెన్నువిరిచిన పార్టీలను రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో ప్రతిపక్షంలో కూర్చొబెట్టారన్న సంగతిని అధికార పార్టీ పెద్దలు గ్రహించాలని ఉటంకించారు. సంఘటిత, అసంఘటిత రంగాలపై సంస్కరణల ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ప్రజలు తమ అవసరాలను కుదించుకుంటూ జీవించే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి పేరిట తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. పట్టణాల్లో పేదలే ఉత్పాదక శక్తిగా ఉన్నారని, సేవారంగంలోనూ ఎక్కడ చూసినా శ్రమజీవులే ఉన్నారన్నారు. సెమినార్‌లో మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జగన్, పీపుల్ ఫర్ ఇండియా నాయకులు బిఎల్.నారాయణ, వార్వా అధ్యక్షులు గురప్ప, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మున్సిపల్ నాయకులు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భగవంత్ కేసరి బృందం సందడి

నిలబెట్టుకుందన్నారు. నటుడు జి.సత్యసాయి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో సమానమని తెలిపారు. శ్రీలీల పాత్ర మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నటుడు మురళీ, జీవన్, నిర్మాత హరీష్ పెద్ది, శ్రీ వేంకటేశ్వర ఫిలిమ్స్ ప్రతినిధి శ్రీనివాస్, మెలోడి థియేటర్ ప్రతినిధులు రమణ, గౌరీ శంకర్, బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షులు కాళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు సాదర స్వాగతం

పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

ఘనంగా ఎఎంసి శతాబ్ది ఉత్సవాలు

ఎఎంసి సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టి.రవిరాజు, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అనకాపల్లి ఎంపీ సత్యవతి, నార్త్ అమెరికా ప్రెసిడెంట్ మైనేని నాగేంద్ర, అంకోసా ప్రెసిడెంట్ కె.శశిప్రభ, ఎఎంసి ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన ఎఎంసి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శనివారం విశాఖకు రానున్నారు. ఆయనకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదాలో ఘన స్వాగతం పలకనున్నారు. శనివారం ఉదయం ఉప రాష్ట్రపతి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. ఐఎన్ఎస్ డేగాను సందర్శిస్తారు. ఈ నేపథ్యంలో నగరంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.



శిలాఫలకం వద్ద మేయర్ హరివెంకట కుమారి తదితరులు

సుందరీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖను ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె సుమారు రూ.147.33 లక్షల వ్యయంతో ఆశీల్‌మెట్ట అండర్ పాస్ సుందరీకరణ పనులకు దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాల మేరకు విశాఖ నగరాన్ని మరింత ఆకర్షనీయ నగరంగా తీర్చుదిద్దుతున్నామన్నారు. అందులో భాగంగా ఆశీల్ మెట్ట అండర్ పాస్ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే విశాఖ నగరంలో ఆకర్షణీయమైన బస్‌బేలు, కూడళ్ల అభివృద్ధి చర్యలు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు.

29న ప్రభుత్వ రంగ సంస్థల రక్షణపై సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణపై ఈ నెల 29న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగనుందని, దీన్ని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని, నవ్యాంధ్రప్రదేశ్ పారిశ్రామిక ఆర్థిక రాజధానిగా ఈ నగరం పేరుగాంచిందని తెలిపారు. సుమారు లక్ష మంది పర్మినెంట్ ఉద్యోగాలు, మరో ఆరు లక్షల మంది ప్రైవేటు ఉద్యోగాలు ఈ మహా నగరం కేంద్రంగా చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యాపార, వాణిజ్య, సేవా రంగాలు ఇక్కడ పెరిగాయన్నారు. చిన్న మత్స్యకార గ్రామంగా వుండే విశాఖ మహా నగరంగా అభివృద్ధి కావడానికి మూలం ప్రభుత్వరంగ సంస్థలేనని గుర్తు చేశారు. విశాఖ పోర్టు, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, బిహెచ్ఇఎల్, షిప్‌యార్డ్, ఎన్‌టిపిసి, రక్షణ రంగం, బిడిఎల్, ఐఒసి, బిపిసిఎల్, రైల్వే, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకులు, విద్యుత్ మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలు ఈ నగరంలో ఉన్నాయన్నారు. వీటి పునాదిపై నిర్మితమైన ప్రైవేటు పరిశ్రమలు, ఆటోనగర్‌లు, ఎస్ఇజెడ్‌లు, ఫార్మాతో నేడు విశాఖ ముఖచిత్రమే మారిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు వేల కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెండ్లు రూపంలో చెల్లిస్తున్నాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళ, వికలాంగులకు ప్రభుత్వ రంగ సంస్థలు సామాజిక న్యాయం అందిస్తున్నాయని అన్నారు. అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడి కొట్టుమిట్టాడిన స్థితిలోనూ భారత ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుంచి కాపాడిన ఘనత ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలదేనన్నారు. చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించి ఇండియా సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన ప్రభుత్వరంగ సంస్థ ఇస్రో అన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ భద్రత ఉంటుందని తెలిపారు. కరోనా కాలంలో ప్రైవేటు, పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు లక్షల సంఖ్యలో ఉద్యోగులను తొలగించాయని, ప్రభుత్వ రంగం ఒక్క ఉద్యోగినీ తొలగించలేదని గుర్తుచేశారు. మెడికల్ ఆక్సిజన్‌ను సరఫరా చేసి వేలాది మంది కోవిడ్ రోగుల ప్రాణాలను కాపాడిన ప్రభుత్వ రంగ సంస్థగా విశాఖ స్టీల్‌ప్లాంట్ కీర్తిగడించిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రజల ఆస్తి అని, అవి లక్షల కోట్ల ఆస్తులు, వేలాది ఎకరాల భూములు కలిగి ఉన్నాయని తెలిపారు. వాటిని మానిటైజేషన్ పైపులైన్ పేరుతో అదానీ, అంబానీ, జిందాల్, పోస్కో వంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం ఉద్యోగుల పొట్ట కొట్టే కుట్రలకు పాల్పడు తోందన్నారు. అశేష త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మకానికి పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలపై దాడి తీవ్రమైందన్నారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగం ధ్వంసమైతే యువత ఉపాధిపై వేటు పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఆదాయాలు కోల్పోతాయన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో ప్రజల సమస్యలే ప్రధాన అజెండాలుగా ముందుకు రావాలనే లక్ష్యంతో సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 29న స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల రక్షణపై రాష్ట్ర సదస్సు తలపెట్టారన్నారు. దీన్ని ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, అభివృద్ధి కాముకులు జయప్రదం చేయాలని కోరారు.

మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విశాఖ కలెక్టరేట్

ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేయగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఓసారి ఆ వివరాలను పరిశీలిస్తే.. అనకాపల్లి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా వున్నారు. చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో మొత్తం 12,57,707 మంది ఓటర్లు వున్నారు. వీరిలో 6,44,516 మంది మహిళా ఓటర్లు వుండగా, 6,13,144 మంది పురుష ఓటర్లు ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 47 మంది వున్నారు. డిసెంబరు 9 వరకు ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో కలిపి మొత్తం ఓటర్లు 19,15,682 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 9,51,682 మంది కాగా, స్త్రీలు 9,64,538 మంది, థర్డ్ జెండర్ 133 మంది ఉన్నారు.

పురుషులతో పోలిస్తే స్త్రీలు 13,527 మంది అధికంగా ఉన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం జిల్లా కలెక్టర్ మల్లికార్జున ప్రకటించారు.

'జగన్‌ది నేరచరిత్ర'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నేర చరిత్ర కలిగిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. చంద్రబాబును 49 రోజులుగా జ్యూడిషియల్ రిమాండ్‌లో పెట్టడాన్ని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం టిడిపి కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో న్యాయదేవతా.. న్యాయం ఎక్కడ పేరిట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు జైల్లో ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. కక్షపూరితంగానే బాబును అరెస్టు చేశారన్నారు.

విఎంఆర్‌డిఎ కార్యదర్శిగా కీర్తి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎ కార్యదర్శిగా దాట్ల కీర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరంలోని 37వ వార్డులో జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన దక్షిణ నియోజకవర్గ నాయకులు చీకటి రమేష్, ఎర్రంశెట్టి సురేష్ కుమార్, చింతపల్లి వెంకటరమణ, వాడమోదుల పోలరాజు, అరిసిల్లి ప్రసాద్, వాడమోదుల తాతాజీ, పొదుపు సంఘాల మహిళలు ఒలిశెట్టి రాజమ్మ, చింతపల్లి శాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీకటి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యువల్స్‌కు దరఖాస్తు గడువు పెంపు

-మార్చి 31 వరకూ అవకాశం

ప్రజాశక్తి -గాజువాక : ప్రైవేట్ పాఠశాలలు గుర్తింపు రెన్యువల్స్ దరఖాస్తు గడువును మార్చి నెలాఖరు వరకు పొడిగించినట్లు జిప్స అధ్యక్షులు పాలవలస భాస్కరరావు తెలిపారు. అతితక్కువ అపరాధ రుసుంతో మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారన్నారు.

ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యువల్స్‌కు ఈ నెలాఖరు వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చుని. ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రకటించగా, దీనిపై విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా)సభ్యులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణని ఆయన నివాసంలో కలిసి, గుర్తింపు రెన్యువల్స్‌కు ఉన్న సాంకేతిక సమస్యలను విన్నవించారు. ఆన్‌లైన్‌లో ఉన్న సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించాలని విన్నవించగా, అలా కుదరదని స్పష్టం చేసిన మంత్రి బొత్స, దరఖాస్తు గడువును కొద్దిపాటి అపరాధ రుసుముతో వచ్చే మార్చి 31వరకు పొడిగిస్తామని స్పష్టం చేశారన్నారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు గమనించి, తగు విధంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాలికల హాస్టల్‌కు రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి వేస్తున్న గ్రావెల్

ప్రజాశక్తి-ఆనందపురం : మండల కేంద్రంలోని బాలికల హాస్టల్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. 'అధ్వానరోడ్డ అభివృద్ధికి అంచనా ప్రతిపాదనలు... అమలు కాని పనులు' శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందన వచ్చింది. ఈ రోడ్డు ఏర్పాటుకు వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు చొరవతో రూ.8లక్షల మండల పరిషత్ నిధులను ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించినట్లు ఎఇఇ ఇ.వెంకటేశ్వర్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ముందుగా గ్రావెల్‌తో రోడ్డు చదును చేస్తామని, అనంతరం కొండ ప్రాంతం నుండి వచ్చే నీరు పోవడానికి సైడ్ కాలువలు నిర్మించి రత్వాత రోడ్డు ఏర్పాటు చేస్తామని ఎఇ తెలిపారు. ఎట్టకేలకు బాలిక హాస్టల్‌కు వెళ్లేమార్గంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంపై వార్డెన్, విద్యార్థులతోపాటు శ్రమజీవుల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మారుమూల గ్రామాల్లో సెల్ టవర్లు

- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని మారుమూల గ్రామాల్లో బిఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్లు ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దబ్బంద, మామిడిలోవ, రామవరం, కుసులవాడ పంచాయతీ ఇచ్చాపురం తదితర గ్రామాల్లో సెల్‌సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో స్థానికులు, ప్రభుత్వ యంత్రాంగం పడుతున్న ఇబ్బందులపై స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులతో మాట్లాడి సెల్‌టవర్లు మంజూరుతోపాటు వాటి ఏర్పాటు పనులు వేగవంతంగా సాగేలా ఎమ్మెల్యే కృషి చేశారు.

మామిడిలోవ పంచాయతీ దబ్బందలో సెల్‌టవర్ పనులు దాదాపు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రామవరం గ్రామంల్లో టవర్ నిర్మాణ దశలో ఉన్నాయి. నెల రోజుల్లో సెల్ టవర్లు అందుబాటులోకి వస్తాయని అధికారులు అంటున్నారు. దీంతో రేషన్ సరుకుల పంపిణీ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతరత్రా అవసరాల్లో ఆన్‌లైన్ సాంకేతిక సమస్యలకు విముక్తి కలగనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

'గీతం'లో 5జి యూజ్ కేస్‌ల్యాబ్

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోడి



వర్చువల్‌గాప్రారంభిస్తున్న మోడీ, గీతంలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 5జి యూజ్‌కేస్ ప్రయోగశాలను దేశ ప్రధాని నరేంద్రమోడి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. 5జి టెక్నాలజీపై ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు లోతైన అధ్యయనాలు జరపడానికి వీలుగా భారత ప్రభుత్వ టెలీకమ్యూనికేషన్ విభాగం దేశ వ్యాప్తంగా 100 5జి యూజ్‌కేస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తుండగా, వాటిలో ఒకటి గీతం వర్సిటీలో నెలకొల్పారు. 80శాతం ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన 5జి ప్రయోగశాలలో అప్లికేషన్ సర్వర్, రూటర్, ఐఒటి గేట్‌వే, మిడ్‌బ్యాండ్, 5జి సిమ్స్, డొంగిల్స్ తదితరాలను మేనేజ్‌మెంట్ డ్యాష్ బోర్డుతో సహ ఏర్పాటుచేశారు. ప్రధాని ప్రారంభించిన ఈ 5జి యూజ్‌కేస్ ల్యాబ్ ద్వారా విద్యా, ఆరోగ్యం, క్రీడలు, భద్రత, పర్యాటకం, వనరుల నిర్వహణ, వ్యవసాయం, విద్యుత్తు, పట్టణ నిర్వహణ తదితర రంగాలలో అధ్యయనాలు చేయడానికి వీలైన సమాచారాన్ని పొందవచ్చు.

ఈ సందర్భంగా గీతంలో జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అధిపతి డాక్టర్ ఆర్.శిరీష మాట్లాడుతూ 5జి ప్రయోగశాలకు గీతం ఎంపిక చేయడంపై భారత ప్రభుత్వానికి, టెలీ కమ్యూనికేషన్ విభాగానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రయోగశాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని విద్యార్థులలో స్టార్టప్‌లను సహితం ప్రోత్సహించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టెలికమ్యూనికేషన్ విభాగం విజయవాడ డైరక్టర్ జి.వి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసిపి మోసాలపై ప్రజా చైతన్యయాత్ర

తెలుగుశక్తి అధ్యక్షులు బివి రామ్



మాట్లాడుతున్న బివి రామ్

ప్రజాశక్తి -తగరపువలస : తెలుగు జాతి భవిష్యత్ కోసమే తెలుగు శక్తి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించినట్లు తెలుగు శక్తి అధ్యక్షులు బి వి రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక జంక్షన్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆయనతో పాటు స్థానిక టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వేళ సామాజిక సాధికార బస్సు యాత్రల పేరుతో వైసిపి ప్రభుత్వం బిసిలను మరోసారి మోసగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్ని రాజకీయ యాత్రలు చేసినా, వైసిపిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, దీనిపై ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ యాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2024 ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు చిలకా నరసింగరావు, ఎం వి గురుమూర్తి, టి సూరిబాబు, బోడేపూడి దొరబాబు, గరే సదానంద, డి వెంకటేష్, డి వెంకటరమణ పాల్గొన్నారు

'నిజం గెలవాలి'కి సంఘీభావం

ప్రజాశక్తి- మాధవధార : చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆయన సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమానికి సంఘీభావంగా 51వ వార్డులో సీనియర్ నాయకుడు సనపల కీర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో ఇన్‌ఛార్జి చిక్కాల విజయ్‌బాబు సూచన మేరకు ఇంటింటికీ వెళ్లి 'నిజం గెలవాలి' అనే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి జయరాజ్, యూనిట్ ఇన్‌ఛార్జిలు బొడ్డేపల్లి లలిత, గురుబిల్లి షణ్ముఖరావు, పేడాడ మధుసూదనరావు, తెలుగుమహిళ నియోజవర్గ సెక్రెటరీ పేడాడ లలితకుమారి, వార్డు అధ్యక్షురాలు ధవళకుమారి, జిల్లా అధికార ప్రతినిధి మెట్ట ప్రమీలారావు, బిసి సెల్ వైస్ ప్రెసిడెంట్ మూల అప్పారావు, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు



భువనేశ్వరికి సంఘీభావం తెలుపుతున్న టిడిపి నేతలు

బాలికపై లైంగిక దాడి కేసు

- నిందితునికి 20 ఏళ్ల జైలుశిక్ష
- రూ.ఐదు వేల జరిమానా
- బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం
- పోక్సో కోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి- విశాఖలీగల్ : తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.ఐదు వేల జరిమానా విధించడంతోపాటు బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో బాధిత బాలిక తరుపున వాదనలు వినిపించిన పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలివి. అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేటలో నివాసం ఉంటున్న బాధిత బాలిక కూల్‌డ్రింక్ కోసం ఇంటిసమీపంలో ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లి, ఏడుస్తూ తిరిగొచ్చింది. ఏం జరిగిందని తండ్రి ఆరా తీయగా, దుకాణ యజమానికి నిందితుడు నిందితుడు షేక్ ఫరీద్ తన కళ్లకు గంతలు కట్టి, అసభ్యకరంగాప్రవర్తించిన విషయాన్ని తండ్రికి చెప్పింది. దీనిపై షేక్‌ఫరీద్‌ను బాలిక తండ్రి ప్రశ్నించగా, సరదా కోసమే చేశానని చెప్పడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిపై నేరాభియోగాలతో ఛార్జిషీట్ దాఖలు చేయగా, విచారించిన ప్రత్యేక పోక్సో కోర్టు నేరం రుజువు కావడంతో నిందితునికి జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది.

ఈకేసులో నిందితుడికి శిక్ష పడేలా నేరాభియోగాలను తగు ఆధారాలతో కోర్టుకు సమర్పించిన ద్వారకా సబ్‌డివిజన్ ఎసిపి పి.రామచంద్రరావు, ఇతర పోలీసు అధికారులతోపాటు బాధిత బాలిక తరుపున కోర్టులో వాదనలు వినిపించిన పిపి కరణం కృష్ణను నగర పోలీస్‌కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : ఒకరి మృతి

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-ఆనందపురం: బోని -ఆనందపురం రోడ్డులో చందక వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలివి.

పద్మనాభం మండలం ఏనుగులపాలెం గ్రామానికి చెందిన పట్నాల అప్పలరాజు (45) క్షవర వృత్తిని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గొట్టిపల్లి జంక్షన్ వద్ద ఉన్న తన షాప్ నుండి ఆనందపురం వైపు ఆటోలో వస్తుండగా, చందక జంక్షన్ వద్ద అతను ప్రయాణిస్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ఆటోడ్రైవర్ రమేష్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన అప్పలరాజుకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు అతనిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇదే ప్రమాదంలో మరో ఐదుగురు విద్యార్థుల్లో బంటుబిల్లి అంకిత చేతివేలు విరిగిపోయింది. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక సీఐ రామచంద్రరావు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. అప్పలరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

మృతుడు భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అప్పలరాజు మృతితో ఆయన స్వగ్రామం ఏనుగులపాలెంలో విషాదం నెలకొంది. ఇంటి పెద్దదిక్కు, పోషణాధారమైన అప్పలరాజు మృతితో అతని భార్య వెంకటలక్ష్మి ఇద్దరు కుమారులు రోహిత్, సాయితో కూడిన నిరుపేద కుటుంబం రోడ్డున పడింది.

కులదూషణకు ఆరు నెలల జైలు శిక్ష

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : కులదూషణ కేసులో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నంలోని షెడ్యూల్ కులాల, తెగల చట్టం కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎల్.శ్రీధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందించిన వివరాలివి. నగరానికి చెందిన కె.ఆశాజ్యోతి కృష్ణాజిల్లా దుగ్గిరాలలోని సెంట్ జోసెఫ్ కాలేజీలో 2017లో బిఇఎస్ కోర్సు చదువుకునేటప్పుడు, అదే కాలేజీలో సహచర విద్యార్థి కృష్ణా జిల్లా అవనిగడ్డకు డాక్టర్ మండల తేజమోహన్ ఆమెతో చనువు పెంచుకున్నాడు. ఇదిలా ఉండగా ఆమె 2017 జూన్ 19న ఆశాజ్యోతికి మరో అబ్బాయితో వివాహం జరిగి, దువ్వాడలో కాపురముంటున్న విషయం తెలుసుకున్న నిందితుడు తేజమోహన్, ఆమె ఇంటికి వచ్చి కులం పేరుతో దూషించాడని బాధితురాలు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు,నేరాభియోగ పత్రాన్ని కోర్టులో సమర్పించగా, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఈ మేరకు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పద్మనాభం: వైసిపి సామాజిక సాధికార బస్‌యాత్ర విజయవంతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల కాంప్లెక్స్‌లో వాలంటీర్లు, పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, మండలంలోని 22 పంచాయతీల్లో నాలుగుచోట్ల విపక్ష సర్పంచ్‌లు ఉన్నప్పటికీ అన్ని పంచాయతీలను సమదృష్టితో రూ.360 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టామన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో పక్షపాతరహితంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. విపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై మాట్లాడుతూ, తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు.

సామాజిక సాధికారిక బస్సు యాత్రకు వికలాంగులు, గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులతోపాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిని దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షులు కె. లక్ష్మణరావు, నేతలు టి.పద్మనాభం, బి సన్యాసినాయుడు, ఇ ఈశ్వరరావు, మామిడి శివ, జి పెదరాయుడు, రమణ రాజు, గోవింద పాల్గొన్నారు,

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు అభినందన



గణేష్‌ను సత్కరిస్తున్న మసీదు కమిటీ, స్థానికులు

ప్రజాశక్తి -మాధవధార : ఇటీవలే నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ వెయిట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించి విశాఖ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన రాయి గణేష్‌కు స్థానికంగా ఆత్మీయ సత్కారం జరిగింది. ఈనెల 5 నుంచి నేపాల్‌లోని పోఖరాలో జరిగిన ఎస్‌బికెఎఫ్ 8వ అంతర్జాతీయ పోటీల్లో వివిధ దేశాల క్రీడాకారులతో పోటీపడిన గణేష్, విజేతగా నిలిచి, బంగారు పతకాన్ని సాధించాడు. స్వర్ణపతక విజేత గణేష్‌ను జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్-ఇ-అల్ ఖదీర్ కమిటీ సభ్యులతో పాటుగా గ్రామస్తులు శుక్రవారం మస్జిద్ ప్రాంగణంలో ఆత్మీయ సత్కారం నిర్వహించి, అభినందించారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షులు మున్నా, కార్యదర్శి వలి, నూర్‌భాషా,మదార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, ఏషియన్ ఛాంపియన్ షిప్, కామన్వెల్త్ పోటల్లో బంగారు పతకాలను సాధించడమే అంతిమ లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి సరైన ప్రోత్సహం అందిస్తే మరింత ముందుకు వెళ్తానని గణేష్ అంటున్నారు.గణేష్‌కు స్పాన్సర్లు సహకారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు సూరిబాబునగర్‌లో రూ.19.80లక్షలతో నూతన అంగనవాడీ భవన నిర్మాణానికి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు శుక్రవారం శంకుస్తాపన చేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, 46వ వార్డు నాయకులు బలిరెడ్డి గోవింద్, కె.చిన్నా, జి.అప్పారావు, కె,లావణ్య , సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పలు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

నిమిషాల్లో సెల్‌ఫోన్ రికవరీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓ మహిళ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లోనే రికవరీ చేసి స్థానిక నేర విభాగం పోలీసులు శుక్రవారం బాధితురాలికి అప్పగించారు. క్రైం ఎస్ఐ ఎస్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికి స్వాధీనం చేసుకున్నారు. ఫోను రికవరీచేసి అప్పగించిన పోలీసులకు సంబంధిత మహిళ ధన్యవాదాలు తెలిపింది.



మహిళకు ఫోన్ ఇస్తున్న ఎస్ఐ

మానసిక ఒత్తిడిని అధిగమిస్తే విజయం

పౌరగ్రంథాలయం సందర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-సీతమ్మధార : మానసిక ఒత్తిడిని అధిగమించి ముందుకు సాగితే విజయం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. గురువారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం గ్రంథాలయంలోని పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులు, విద్యార్థులు, పాఠకులతో మాట్టాడుతూ, విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలతోనూ, పుస్తకాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన విద్యాభ్యాసం, అనంతరం వైద్యవృత్తి, తర్వాత ఐఎఎస్‌కు ఎంపిక నుంచి ప్రస్తుతం కలెక్టర్‌గా విధుల నిర్వహణకు వరకు ప్రస్థానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ప్రణాళికాబద్ధంగా కఠినశ్రమతో పోటీ పరీక్షలకు సిద్ధమైతే విజయం సాధించగలరని, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఉత్సాహంతో ప్రయత్నం సాగించాలన్నారు. జీవితంలో రాణించాలంటే బహుముఖ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, పుస్తక



పౌరగ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పఠనం అందుకు దోహదపడుతుందని వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవభావంతో మెలుగుతూ, క్రమశిక్షణతో ఆదర్శవంతంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి డిఎస్ వర్మ, ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు టిఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్. సూర్యారావు, గ్రంథాలయం ప్రతినిధులు దుర్గారాణి, జ్యోతి పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవాలి

విదేశీ విద్యార్థుల ఓరియంటేషన్‌లో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్



విదేశీ విద్యార్థులతో గీతం రిజిస్ట్రార్, ఇతర ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు భారత సంస్కృతి సంప్రదాయాలను అర్థం చేసుకుని, అందులో మంచిని గ్రహించి విద్యార్థులతో సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వంతో పట్టభద్రులుగా తమ దేశాలకు వెళ్ళాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ సూచించారు.. శుక్రవారం గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం నిర్వహించిన నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, అంకిత భావం, కష్టపడే గుణం ఉంటే ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. గీతంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సధుపాయాలు, అధ్యాపకుల మార్గదర్శకం ద్వారా విదేశీ విద్యార్థులు సకాలంలో కోర్సులు పూర్తి చేసి తిరిగి దేశాలకు వెళ్లేలా వీలు కల్పిస్తున్నాయన్నారు. గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ వై.రాధిక మాట్లాడుతూ గీతంలో నిర్వహిస్తున్న కోర్సులు, సిలబస్ బోధన, హజరు, ఈ-లెర్నింగ్ సధుపాయాలు విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను గీతంలో అమలు చేస్తున్నామన్నారు. గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరక్టర్ డాక్టర్ కె.పి.సి.కిషన్ మాట్లాడుతూ గీతంలో ప్రస్తుతం 25 దేశాలకు చెందిన 400 మందికి పైగా విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని, కొత్త విద్యా సంవత్సరంలో 120 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని వెల్లడించారు. విదేశీ విద్యార్థుల ద్వారా గీతం అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతోందని తెలిపారు. అంతర్జాతీయ విద్యార్థులకు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ స్కాలర్ షిప్‌ల రూపంలో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా గీతం నుంచి పిహెచ్‌డి డిగ్రీ పూర్తి చేసిన విదేశీ పరిశోధక విద్యార్థి దన్‌లాడి సగిర్‌ను సన్మానించారు. గీతంలోని విదేశీ విద్యార్థుల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వివిధ సంగీత, నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు.

నగరంలో అంతర్జాతీయ క్రికెట్ సందడి

ప్రజాశక్తి - పిఎం పాలెం: నగరంలోని ఎసిఎ విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఈ ఏడాది పలు దేశవాళీ లీగ్, జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు వేదిక కానుంది. వీటికి సంబంధించి వివరాలను శుక్రవారం స్టేడియం ఆవరణలో మీడియా సమావేశంలో ఎసిఎ సెక్రటరీ ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి, ట్రెజరర్ ఎస్‌వి చలం వివరాలను వెల్లడించారు. వచ్చేనెల 23న భారత్ ఆసీస్ జట్లు మధ్య టి20 మ్యాచ్ జరుగుతుందన్నారు. డిసెంబర్ 2,3,4 తేదీల్లో లెజెండ్ క్రికెట్ లీగ్ 2023 పోటీల్లో భాగంగా ఆరు జట్లు ప్రాతినిధ్యం వహించే పోటీలుమూడు రోజులు పాటు పీఎం పాలెం స్టేడియం వేదికగా మూడు రోజులపాటు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ లీగ్‌లో ఇండియా క్యాపిటల్స్ జట్టుకు గౌతమ్ గంభీర్, కెవిన్ పీటర్సన్,హసీం ఆమ్లా, గుజరాత్ గైంట్స్ జట్టుకు క్రిస్ గేల్, శ్రీశాంత్, హార్థిక పటేల్, బిల్వారా కింగ్స్ జట్టుకు ఇర్ఫాన్ పఠాన్, షేన్ వాట్సన్, యూసఫ్ పఠాన్, తిలకరత్నే దిల్షాన్, మణిపాల్ టైగర్స్ జట్టుకు హర్భజన్ సింగ్, రాబిన్ ఊతప్ప, మహమ్మద్ కైఫ్, సౌతర్స్ సూపర్ స్టార్స్ జట్టుకు ఆరోన్ ఫించ్, రాస్ టేలర్ ,జెస్సి రైడర్, అర్బన్ రైసెస్ జట్టుకు సురేష్ రైనా, మార్టిన్ గుప్టిల్ వంటి అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లు ఈ లెజెండ్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల్లో పాల్గొంటారన్నారు. ఫిబ్రవరి 2న ఇండియా ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ మ్యాచ్‌కు కూడా ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియం వేదిక కానుందన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎసిఎ ప్రతినిధులు గోపీనాథరెడ్డి, చలం

ఆసీస్, ఇండియా టీ20 మ్యాచ్‌కు ఏర్పాట్లు షురూ

వచ్చేనెల 23న జరగనున్న భారత్ ఆసీస్ టీ20 మ్యాచ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో జరిగిన పొరపాట్లు దృష్టిలో పెట్టుకొని క్రికెట్ ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. స్టేడియంలో మరమ్మతులకు గురైన 7వేల కుర్చీలను తొలగించి కొత్తవి అమరుస్తున్నామన్నారు. టిక్కెట్ల విక్రయం, స్టేడియంలో తాగునీటి సదుపాయం, చుట్టుపక్కల ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు.

పలువార్డుల్లో గడపగడపకూ...



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపి ఎంవివి

ప్రజాశక్తి- ఆరిలోవ : అర్హులైన లబ్దిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని వైసిపి తూర్పు సమన్వయకర్త, ఎంపి ఎం.వి.వి.సత్యనారాయణ అన్నారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్ పరిశర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు అందాయా లేవా అని పశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేయాలని సచివాలయ సిబ్బంధిని, వాలంటీర్లుకు సూచించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌చార్జ్ కెల్ల సత్యనారాయణ, వార్డు మహిళా అధ్యక్షురాలు శిరీష పాల్గొన్నారు.

సీతమ్మధార : 26వ వార్డు వైసిపి అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పాల్గొని, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు అర్హులకు సంక్షేమ లబ్ధిని అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌సి వై విజయలక్ష్మి, వైసిపి నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సిఎం చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- పెందుర్తి: వైసిపి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ఇచ్చిన హామీల్లో 93శాతానికి పైగా అమలు చేసిన జగన్మోహనరెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. శుక్రవారం సుజాతనగర్ పార్టీ కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఐదు,ఎనిమిదో జోన్ వైసిపి అధ్యక్షులు, కేడర్‌కు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయా ఇళ్లకు సిఎం జగన్ ఎంత లబ్ధి చేకూర్చారో వివరించాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి, వైసిపిని మళ్లీ గెలిపించే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

విద్యార్థినులకు స్కూల్ బ్యాగ్‌లు



బ్యాగ్‌లు అందుకున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- తగరపువలస :నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమిలి మండలం, చిప్పాడ జెడ్‌పి హైస్కూల్‌లో 80మంది విద్యార్థినులకు శుక్రవారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. బాలికల విద్యను ప్రోత్సాహించే లక్ష్యంతో నాంది ఫౌండేషన్ చేస్తున్న కృషిని హెచ్‌ఎం ఎంవిటి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, కీర్తి అనురాధ అభినందించారు. ఇనస్ట్రక్టర్లు లక్ష్మి, అహల్య, రాజేశ్వరి, రామస్వామి పాల్గొన్నారు.

కాలుష్యానికి కారణమైన క్రెబ్స్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం నేతులు శంకర్రావు, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

కసింకోట మండలం తేగాడ పరిసర మూడు గ్రామాల పరిధిలో కాలుష్యానికి కారణమైన క్రెబ్స్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శంకర్రావు, మండల కార్యదర్శి దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తేగాడలో ఉన్న క్రెబ్స్ కెమికల్ కంపెనీ నుండి విడుదలవుతున్న విషవాయువుల వలన సమీపంలో ఉన్న మూడు గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూగర్భ జలాలు కలుషితమై బోరు బావుల నుండి కలుషిత నీరు వస్తుందని తెలిపారు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారన్నారు. పక్కనే ఉన్న కస్తూరిబా గాంధీ కళాశాల, మోడల్ స్కూల్ రెండింటిలో 700 మంది విద్యార్థులు ఉన్నారని, కంపెనీ వదులుతున్న విషవాయువులతో వారు వాంతులు, ఇతర వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై గ్రామాల ప్రజలు పలు సార్లు ఆందోళన నిర్వహిస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో విష వ్యర్థాలను సమీప కొండలపై చల్లడంతో మూగజీవాలు చనిపోయాయని గుర్తు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు సరైన తనిఖీ లేకపోవడం వలన కంపెనీ యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తోందని, తక్షణమే తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని భూగర్భ జలాలను తనిఖీ చేయించి గ్రామస్తులు తాగడానికి రక్షిత మంచినీటిని ఏర్పాటు చేయాలని, విషవాయువులు వదలకుండా కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గొల్లవిల్లిని అభినందిస్తున్న దిలీప్‌కుమార్ తదితరులు

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మార్కెట్ కమిటీ కార్యాలయంలో రాష్ట్ర ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సూరిశెట్టి రమణ అప్పారావు తదితరులు సత్కరించారు.



ప్రశంసాపత్రం చూపుతున్న విద్యార్థి నాగచైతన్య

సెయింట్ జాన్స్ విద్యార్థికి ప్రధాని ప్రశంసా పత్రం

ప్రజాశక్తి- కశింకోట

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తుత పరీక్ష విధానంపై ఇటీవల నిర్వహించిన చర్చా-2023లో సెయింట్ జాన్స్ విద్యార్థి నాగచైతన్య ప్రతిభ కనబర్చగా, ఆ విద్యార్థికి ప్రధానమంత్రి నుండి ప్రశంసా పత్రం అందించారు. ఈ మేరకు పాఠశాలలో నాగచైతన్యను శుక్రవారం స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ టి సాజిద్, ఉపాధ్యాయులు అభినందించారు.

రామనగర్‌లో వివిధ పోటీలు

ప్రజాశక్తి - యలమంచిలి : దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక రామనగర్ ప్రాంతంలో శుక్రవారం వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తేజసాయకృష్ణ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యారు. దితీయ స్థానంలో జయదీప్ నిలిచినట్లు నిర్వహకురాలు నూకరత్నం తెలిపారు. యువకులు, చిన్నారుల్లో నిభడీకృతమైన వివిధ ప్రతిభా పాటవాలను వెలికి తీయాల్సిన అవసం ఉందని స్థానిక సీనియర్ ఉపాధ్యాయురాలు రామలక్ష్మి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, పిల్లల ఉట్టి సంబరం పలువుర్ని ఆకర్షించింది. నిర్వాహకులు లంక రాజు, అచ్చిరాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



తేజసాయి కృష్ణకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అత్యధికంగా రెవిన్యూ సమస్యలపై ఫిర్యాలు అందాయి. 238 మంది రెవెన్యూ సమస్యలపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. లోపూడి మిలటరీ బేస్ క్యాంప్ (డిఆర్‌డిఓ) ఉపయోగించే మురుగునీటిని గుర్రపు గెడ్డలో విడిచిపెట్టడం వలన సబ్బన్న కట్టు, దొండావారి ఆయుకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గుర్రపు గడ్డలోనికి విడిచిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు, సిఐటియు మండల నాయకులు ఈ సాంబశివరావు, గుర్రపు గెడ్డ ఆయకట్టు మాజీ చైర్మన్ బత్తుల శ్రీను, రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మురుగునీటి వల్ల గుర్రపు గెడ్డలో బట్టలు ఉతకడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రజకులు తాళ్లవలస పైడయ్య, తాళ్లవలస అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. రాజాం రెవెన్యూలో గతంలో జరిగిన భూ సర్వేలో అనేక తప్పులు దొర్లాయని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, మళ్లీ రీ సర్వే నిర్వహించి రికార్డులను సర్వే చేయాలని రాజాం మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్ తదితరులు ఫిర్యాదు చేశారు. పలు గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు ఫిర్యాదు చేశారు.

దిబిడి ఉన్నత పాఠశాల పరిశీలన

బుచ్చయ్యపేటలో స్పందన కార్యక్రమాన్ని ముగించుకుని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో బోధనా విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెర్లోపల్లి గ్రోయిన్ మరమ్మతులకు చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి

శారదా నదిపై ఉన్న చెర్లోపల్లి గ్రోయిన్ తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ నేతలతో కలిసి ఎంపిపి గ్రోయిన్‌ను సందర్శించారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, నీటి కొరత ఉందని మొరపెట్టుకున్నారు. రైతులతో వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతులకు ఎంత అవుతుందో మంత్రికి ఫోన్‌లో వివరించారు. తక్షణమే సంబంధిత అధికారులకు చెప్పి మరమ్మతులకు ఎంత అవుతుందో అంచనా వేయాలని కోరారు. మండల పరిషత్ నిధుల నుండి నిధులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దాడ రామ్ శంకర్, పీలా బుజ్జి, పాల్గొన్నారు.

ఎఎంఎఎల్‌లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మర్చంట్స్ అసోసియేషన్ లింగమూర్తి కళాశాల (ఎఎంఎఎల్)లో సోలార్ ప్లాంట్ నిర్మాణం నిమిత్తం లక్ష రూపాయల విరాళాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ జయబాబు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు సంస్కృతి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుండి 30 వరకు రాజమండ్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు అండర్ 19, 17, 14 విభాగాల్లో 18 మంది సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తునట్టు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ మధుబాబు తెలిపారు. వీరిని శుక్రవారం సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతలక్ష్మి, సీఈఓ కె.నిశంత్ అభినందనలు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు కోచ్‌గా యస్. రామ్మోహన్, మేనేజర్‌గా ఎమ్.మనీష్‌లు వ్యవహరించనున్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ తదితరులు

నాగులాపల్లి పిఎసిఎస్ పని తీరు భేష్

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి సహకార సంఘం పనితీరు అభినందనీయమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యనిర్వహణాధికారి డివిఎస్ వర్మ అన్నారు. నాగులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాంలోని 25 సహకార సంఘాల కార్యనిర్వహణాధికారులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలో ఉన్న సభ్యులకు అన్ని రకాల రుణ సదుపాయంతో పాటు డిపాజిట్ సేకరణ, బంగారు ఆభరణాలపై రుణాలు తదితర పథకాలు అమలు చేస్తూ, ప్రతి సంవత్సరం 15శాతం డివిడెంట్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సంఘ అధ్యక్షులు మల్ల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పాలకవర్గం, సిబ్బంది సహకారంతో సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 20 మంది మహిళలకు మహిళా జాయింట్ లైబిలిటీ గ్రూపులకు రూ.2 లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి రాష్ట్ర సహకార బ్యాంకు డీజీఎం శ్రీనివాస్, ఆప్కాబ్ పిడిఎస్ఎల్ మేనేజర్ రాజు, సంఘ సీఈవో మల్ల స్వామి, పాలకవర్గ సభ్యులు నరాలశెట్టి బాబురావు, కోయిలాడ ఎర్రయ్య నాయుడు, తిమ్మరాజుపేట, తుమ్మపాల, చూచుకొండ, కసింకోట కార్యదర్శులు మహేశ్వరరావు, ఈశ్వరరావు, సోము నాయుడు, నూకేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వర్మ తదితరులు

సామాజిక రక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

సామాజిక రక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్పి మురళీకృష్ణ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ మైదానంలో రెండవ రోజు "ఓపెన్ హౌస్" నిర్వహించారు. పట్టణంలో వివిధ పాఠశాలలు, కాలేజీల నుండి విచ్చేసిన విద్యార్థులకు పోలీసు విధుల పట్ల, వినియోగించే ఆయుధాలు, సాంకేతికత, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీం, ట్రాఫిక్, కమ్యునికేషన్ పరికరాల పట్ల అవగాహన కల్పించి, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా రక్తదానం శిబిరం అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ ఇనస్పెక్టర్ సతీష్, అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్ఓ మోహనరావు, ఎస్సై సత్యనారాయణ, ఎఆర్ ఎస్సై ఆదినారాయణ, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని పోలీస్ గ్రౌండ్స్‌లో పోలీసు ఓపెన్ హౌస్ ఏర్పాటు చేసి ఆయుధాలను ప్రదర్శించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిపి రవిశంకర్

సిపిఎం ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాంబిల్లి

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపడుతున్న ప్రజా రక్షణ భేరి కార్యక్రమం వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు బస్సు జాతాలు నిర్వహించి, ప్రజలను చైతన్యపర్చి, నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బస్సు యాత్ర నవంబర్ 5న అనకాపల్లి జిల్లాకి వస్తుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు, వెనుక బడిన జిల్లాల అభివృద్ధి నిధులు, విశాఖ రైల్వేజోన్, కేంద్ర, విద్యా, వైద్య సంస్థలు అన్ని విభజన హామీలను తుంగలో తొక్కి ఆంధ్ర రాష్ట్రానికి అన్ని విధాలా నష్టం, ద్రోహం చేసిందని విమర్శించారు. తమకు అధికారం ఇస్తే మోడీ మెడలు వంచి విభజన హామీలను సాధిస్తామని చెప్పిన జగన్ మోడీ ప్రభుత్వానికి దాసోహమయ్యారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి వంత పాడుతున్నాయన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ఈ మూడు పార్టీలు పోరాడటం లేదని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ప్రజలు ప్రజా పోరాటాలను బలపర్చాలని, సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు సిహెచ్ రామకృష్ణ, వై రాము, సిహెచ్ పవన్ కుమార్, జి కాశీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నేటి నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : జాతీయ ఉపాధి హామీ పథకంలో ఖర్చు చేసిన నిధులపై పలు శాఖల అధికారులు శనివారం నుండి పది రోజులు పాటు ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా విజిలెన్స్ అధికారి పి నిర్మలాదేవి తెలియజేశారు. 2022- 23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, అటవీ శాఖల ద్వారా వేతన రూపంలో రూ.8 కోట్లు, మెటీరియల్ ఖర్చుల రూపంలో రూ.5.5 కోట్లు వినియోగించినట్లు చెప్పారు. మొత్తం పనుల ఖర్చులపై ఎస్ఆర్పి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏడుగురు డిఆర్పీలు, ఏడుగురు విఎస్ఎలతో తనిఖీ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. నవంబర్ 10న పూర్తిస్థాయిలో ఆడిట్ వివరాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజనీర్ బాలాజీ అప్పారావు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి, ఉపాధి హామీ ఏపీవో అప్పలరాజు, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయానికి భూమి అప్పగింత

ప్రజాశక్తి-అనకాపల్లి : సుంకరమెట్ట సూర్యనారాయణమూర్తి దేవస్థానం భూమిని ఆలయానికి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శుక్రవారం అప్పగించారు. మంత్రి ఆదేశాలతో దేవస్థానం చైర్మన్ కే.ఎం.నాయుడు, ఈవో ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆలయ భూమి రీసర్వే నిర్వహించారు. ఆలయానికి చెందిన రెండు కోట్ల రూపాయల విలువైన సుమారు 8 సెంట్ల స్థలాన్ని ఆక్రమణకు గురైనట్లు గుర్తించి తక్షణమే సరిహద్దు రాళ్లను పాతారు. ముందుగా మంత్రి అమర్నాథ్ సూర్యనారాయణను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తాడి కోటేశ్వరరావు మారిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు, విద్యాసాగర్, దేవాలయ సిబ్బంది మళ్ల గణేష్, కాంగ్రెసు రామారావు , గుమస్తా శ్రీను పాల్గొన్నారు.

ఈ-క్రాప్ ముసాయిదా జాబితాల ప్రదర్శన

ప్రజాశక్తి- సబ్బవరం : ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని, వాటిని రైతులు పరిశీలించుకోవాలని స్థానిక ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు కోరారు. ముసాయిదా జాబితా ప్రదర్శన సందర్భంగా ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 26 నుంచి 29వ తేదీ వరకు జాబితా అందుబాటులో ఉంటుందని, అభ్యంతరాలు ఏమైనా ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. మండలంలో ఈ సీజన్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు అన్నీ కలిపి 7,200 ఎకరాలు ఈ-క్రాప్లో నమోదు చేయగా, అందులో 3300 ఎకరాలు వరి పంట ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వివిఎస్ బ్రహ్మ, బోకం సూర్యనారాయణ, వ్యవసాయ సహాయకులు ఎం.హేమలత పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఈ ఖరీఫ్ సీజన్లో 10,032 మంది రైతులకు గాను 13,700 ఎకరాల్లో పంటల సాగు, ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎల్లె కాంతమ్మ తెలిపారు. శుక్రవారం దేవరాపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద ఈక్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్ కుమార్, సచివాలయం సిబ్బంది భాగ్యలక్ష్మి, సత్యారావు, రైతులు పాల్గొన్నారు.



ఈ - క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపిపి తదితరులు

ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలపై పిడిఎస్ఓ నిరసన



నిరసన తెలుపుతున్న పిడిఎస్ఓ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి -అనకాపల్లి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని నిరసిస్తూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ పాలస్తీనా భూ భాగంలోకి చొరబడి, అమెరికా సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయిల్ నరమేధాన్ని సృష్టిస్తుందన్నారు. ఆయిల్, ఆహారం, నీరు అందనివ్వకుండా చేసి పాలస్తీనా జాతి హననానికి పాల్పడుతుందని విమర్శించారు. కాందిశీకులుగా పాలస్తీనాకు వచ్చిన ఇజ్రాయిల్ నేడు పాలస్తీనా ఇళ్లపై, గాజాలోని హాస్పిటల్స్పై బాంబుల వర్షం కురిపిస్తూ, మిస్సైల్స్ను పంపుతూ వేల మందిని చంపుతూ, లక్షల మందిని నిరాశ్రయులుగా చేస్తుందని తెలిపారు. అరబ్బు దేశాల మధ్య ఉన్న ఇజ్రాయిల్ను అమెరికా తన మిలటరీ స్థావరంగా వాడుకుంటూ, ఆయిల్ వ్యాపారంపై తన పట్టును కాపాడుకుంటూ, యుద్ధంలో ఇజ్రాయిల్కు ఆయుధాలు అమ్ముకుంటూ ప్రపంచంలో యుద్ధాలను పెంచిపోషిస్తుందని విమర్శించారు. తమ జాతి కోసం, స్వేచ్ఛ కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు మేధావులు, వివిధ సెక్షన్ల ప్రజలు తమ సంఘీభావాన్ని తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యు.జానకిరామ్, ఎస్. నాగేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలుపుదల చేసి బేషరతుగా ఆంక్షలు ఎత్తివేయాలని ఓపిఆర్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె గౌరీ శంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయిల్ దాడులకు పూనుకుంటుందని, దీంతో సాధారణ పౌరులు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, బతికున్న వారు మంచినీరు, ఆహారం, వైద్యం అందక నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న

మెడికల్ ఆఫీసర్పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

కిందిస్థాయి ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న దేవరాపల్లి పిహెచ్సి మెడికల్ ఆఫీసర్పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదలకు వైద్యం అందించాల్సిన డాక్టర్, చిన్న పాటి సమస్యతో ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్యం అందించకపోగా, రిఫర్ చేస్తున్నారన్నారు. కొద్ది రోజుల క్రితం యుడిసిని బదిలీ చేయాలని ఉపముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లే ఆయన మందలించారని గుర్తు చేశారు. ముసిడిపల్లి ఎంఎల్హెచ్పి అనారోగ్యంతో బాధపడుతూ సెలవు అడిగితే ఇవ్వకపోగా, వేధింపులకు గురి చేయగా, ఆ సమస్య పోలీసు స్టేషన్ వరకు వెళ్లిందన్నారు. మెడికల్ ఆఫీసరు వేధింపులు తాళలేక గర్సింగి ఎంఎల్హెచ్పి ఏకంగా ఉద్యోగానికి రిజైన్ చేశారని, చింతలపూడి ఎంఎల్హెచ్పి బదిలీపై వెళ్లిపోయారని, ప్రస్తుతం హెల్త్ సూపర్వైజర్ మెడికల్ లీవ్పై ఉన్నారని తెలిపారు. ఆయన వ్యవహార్లశైలిపై కొంత మంది విజయవాడ అడిషనల్ డైరెక్టర్కు ఫిర్యాదు చేయగా, దర్యాప్తుకు నియమించిన అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రెండేళ్ల క్రితం ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన హెచ్డిసి నిధులను ఖర్చు చేయకుండా వెనక్కి పంపించేశారని తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాలకు సైతం ఆయన డుమ్మా కొడుతున్నారని, తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని వెంకన్న విజ్ఞప్తి చేశారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామాలలో చేపట్టే పలు అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆదేశించారు. మండలంలోని గుడిమడక సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరై, అనంతరం గ్రామంలో రూ.60 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కాంక్రీట్ పని పూర్తి అయిన అనంతరం ఎక్కువసార్లు వాటరింగ్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార వర్మ, గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని, మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, నాయకులు కోన బుజ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

టిడిపి విజయమే లక్ష్యంగా పని చేయాలి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రానున్న ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం అచ్యుతాపురంలో నియోజకవర్గ ఇన్ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ జగన్ పట్ల రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో టిడిపికి చెందిన ఓటర్లను తొలగించడం, దొంగ ఓట్లను చేర్పించడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. చంద్రబాబును అన్యాయంగా తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన కలిసి పనిచేస్తాయన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పప్పుల చలపతిరావు, జెడ్పీ మాజీ చైర్పర్సన్ లాలం భవాని, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల అధ్యక్షులు జనపరెడ్డి నరసింగరావు, దూళి రంగనాయకులు, దిన్బాబు, మెరుగు బాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాధ భరించలేకే బస్సు యాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డి బాధ భరించలేకే మంత్రులు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ఎలక మల్లి బాబు, బర్రి చిన్నబ్బాయి, షేక్ రియాజ్, గుడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ, బీసీల భూములను గుర్తించడానికే బస్సు యాత్ర

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతుల వారి భూములను గుర్తించడం కోసమే వైసిపి ప్రభుత్వ మంత్రులు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. గవరపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్ అవినీతికే బ్రాండ్ అంబాసిడర్గా మారారన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మళ్ళ సురేంద్ర, కాయల మురళి, ఆళ్ళ రామచంద్ర రావు, తలారి కాశీ నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్రంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు స్వస్తి పలకాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని బాట జంగాలపాలెం గ్రామంలో జరిగిన బాబుతో మేము సైతం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ప్రసంగించారు. చంద్రబాబు, లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న కార్యక్రమాలను చూసి భయపడిన జగన్ రెడ్డి కుట్రతో చంద్రబాబును తప్పుడు కేసులతో జైల్లో పెట్టించారని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పడాల వెంకటరమణ, టిడిపి నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి రవికుమార్, బర్నికాన బాబూరావు, కొటాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే గెలిపిస్తాయి

ప్రజాశక్తి- అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 53 నెలల కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి వైసీపీని అధికారంలోకి తెస్తాయని వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్లో వైసిపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పల్లెనిద్ర నిర్వహించి మరునాడు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం ఇంటింటికి వెళ్లి ఆపు బాబు మీ నాటకం... జగనే మా నమ్మకం అనే కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. నవంబర్ 2వ తేదీన సామాజిక సాధికార బస్సు యాత్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లే అనురాధ, ఎంపిపి గొర్లె సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణుమూర్తి, జాజుల రమేష్, బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, కెయం నాయుడు, మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అతి తక్కువ ఖర్చుతో ఇంటికే పార్శిల్

-జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి పద్మావతి



డోర్ డెలివరీ స్టిక్కర్లు చూపిస్తున్న పద్మావతి, అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :శరన్నవరాత్రులు ఉత్సవాలు సంధర్భంగా డిపోలకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చినందుకు నర్సీపట్నం డిపో లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల అభినందనసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కే.పద్మావతి పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో అధిక ఆదాయాన్ని తెచ్చినందుకుగాను ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. నర్సీపట్నం డిపోలో ఈనెల 25న 103 శాతం ఆక్యుపేషన్ రేషియో, 26న 105 శాతం వచ్చిందన్నారు. శరన్నవరాత్రుల ఉత్సవాల సంధర్భంగా నర్సీపట్నం డిపో నుండి భవానీ భక్తులకు విజయవాడ, హైదరాబాద్ వివిధ ప్రాంతాలకు 71 ప్రత్యేక బస్సులు బస్సులు నడపడంతో 3,65,6515 ఆదాయం వచ్చిందని చెప్పారు. గత సంవత్సరం 68 ప్రత్యేక బస్సులు నడుపడంతో 3467076రూ. ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆర్టీసీలో రాష్ట్ర వ్యాప్తంగా డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, కొరియర్స్ లేదా పార్సిల్ 50 కేజీల వరకు, ముఖ్యమైన ఎంపిక చేసిన పట్టణాల్లో అతి తక్కువ ఖర్చుతో అంత్యంత వేగంగా మీ ఇంటికే పార్సిల్ అందించబడుతుందని అన్నారు. ఈ సందర్భంగా డోర్ డెలివరీ స్టిక్కర్ లను పంపిణీ చేశారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిపో మేనేజర్ ఎం.యస్.యస్.ధీరజ్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) యస్.యస్.నాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా శాఖ అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, నర్సీపట్నం డిపో సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఎన్ఎంయు నేతలు

సమస్యలపై నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సమస్యల పరిష్కరించాలని ఎపిఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్జూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసి డిపో ఇన్ గేటు వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా జోనల్ కార్యదర్శి ఎంవిఆర్.మూర్తి, కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ, కేంద్ర కార్యాలయ ఉత్తర్వుల మేరకు సస్పెండ్, రిమూవ్ అయిన ఉద్యోగులు ఆపీల్స్ చూడాలన్నారు. ఆపీల్సును పరిష్కరించి ఆ ఉద్యోగులకు ఆదే డిపోలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఒటి ఎన్ఒడిఓలను ఆదే నెలలో ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. అన్ని కేటగిరి ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, పదోన్నతులు కల్పించాలన్నారు. అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులకు సిక్ సెలవులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జి.ఎస్. నారాయణ, ఉద్యోగులు వి.చిన్న, ఎం.రమణ, కె.సన్యాసిరావు, కె.కళ్యాణం, జి.కోటేశ్వరమ్మ, గనీశ్వరి, ధనలక్ష్మి, ఆర్.లక్ష్మి, వేణి, ఆర్.మూర్తులు, సతీష్, ఎఎస్.రావు, కె.ఎ.రావు పాల్గొన్నారు.

జోగుంపేటలో విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం జోగంపేట బిసి కాలనీ శివారు శివగిరి కొండపై దుర్గా మల్లేశ్వర ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వర సాహిత విగ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగ ప్రతిమల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో దుర్గాదేవిని, పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కొరకు ముందుకు వచ్చిన దాతలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొమరం భీమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొమరం భీమ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక మోదమాంబ కాలనీ కమ్యూనిటీ భవనంలో గిరిజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి పాల్గొని మాట్లాడుతూ, ఆదివాసి విప్లవ వీరుడు కొమరం భీమ్ అని కొనియడారు. ఆదివాసీల హక్కుల, సమస్యల పరిష్కారం కోసం గిరిజనులంతా కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్రీ బోయిన దేముడు, సిద్ధార్థ, సాగాని పోతురాజు, గిరిజనులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మెల్యేగారూ.. ఆదుకోండి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:గొలుగొండ మండలం సిహెచ్ ఎర్రవరం గ్రామానికి చెందిన పట్నాల కుమారి ఎమ్మెల్యే గారు ఆదుకోండి సార్ అంటూ స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, గత సంవత్సరం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీ బోర్డు కడుతున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై తన భర్త చనిపోయాడని తెలిపింది. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఇద్దరు చిన్న పిల్లలతో ఇబ్బందులు పడుతున్నానని ఆమె వాపోయారు. అప్పటి నుంచి నాయకులు తమను ఆదుకుంటామని చెప్పినా అమలు కాలేదన్నారు. ఎమ్మెల్యే ఆదుకోవాలని ఆమె మీడియా వద్ద విలపించారు.



మాట్లాడుతున్న కుమారి

చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:విద్యార్థులలో ప్రతిభా పాటవాలు వెలికి తీయాలని మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఏర్పాటు చేసిన చిత్రలేఖన పోటీలను ఆయన ప్రారంభించారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఐదు రోడ్ల వద్ద పి ఆర్ టియు ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దేశభక్తి గీతాలను ఆలపించారు. న్యాయం నిర్ణయాత్తుగా మహిళా టీచర్లు వ్యవహరించారు. నవంబరు 14న సిటీ క్లబ్ ఆవరణలో బాలల దినోత్సవం వేడుకలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని పీఆర్టియు జిల్లా అధ్యక్షులు డి గోపీనాథ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి. నాథ్, నాయకులు రవిశంకర్ (బాబీ), అడిగర్ల వరహాల నాయుడు, అల్లు అప్పా రావు, కె.రమణ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత


ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని అడవిల అగ్రహారం గ్రామంలో ప్రమాదవశాత్తూ మరణించిన మైచర్ల గాలిదేముడు కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ భీమా నగదు రూ.10,000లు గ్రామ సర్పంచ్ సలాది ధనలక్ష్మి గంగశేషు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు గంటా మత్యరాజు, సలాది సన్యాసిరావు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న సర్పంచ్

ప్రజల చెంతకే వైద్య సేవలు

-పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని జానకయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. పోషకాహార స్టాల్స్ ను పరిశీలించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి పాల్గొన్నారు.

మాడుగుల:మండలంలోని జి.అగ్రహారం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. శుక్రవారం గొట్టివాడ అగ్రహారం, చింతలూరు సచివాలయ పరిధిలో మాడుగుల ఎంపీపీ రామధర్మజ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. 471 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులను గ్రామ సర్పంచ్ నందారపు మంగమ్మ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆర్లి మాధవి నాయుడు, సెక్రెటరీ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

కోటవురట్ల: ఆరోగ్య సురక్షతో పేదల ముంగిటకే వైద్యం అందుతుందని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు అన్నారు. బికే పల్లి గ్రామంలో సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు బాబులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని ఊడేరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరిశెట్టి కృష్ణమోహన్, పెద్దాడ రామ్ శంకర్, సకల సంతోష్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, చిరికి సత్యనారాయణ, వెన్నల చిన దేముళ్ళ, ఎమ్‌పిడిఓ రవికుమార్, వైద్య అధికారి డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ పరిశీలించారు. 500 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కొంతమందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామసుందర్, ఆశ కార్యకర్త అరుణ, పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ప్రారంభించారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కర్రీ సత్యం, వైసిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు, డాక్టర్ సింహాచలం నాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

ములగాడ : 40వ వార్డు ఎకెసి కాలనీ యుపిహెచ్‌సి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చే రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థికసాయంతో వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చిన రోగులు, ప్రజలకు సుమారు 500మందికి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో కలిదిండి బద్రీనాథ్, సోమినాయుడు , యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి నాయుడు, స్పెషలాఆఫీసర్ శ్రీరామ్మూర్తి, జివిఎంసి అధికారులు, వైద్యఆరోగ్యం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు దాడి రామూర్తి కల్యాణ మండపం యుపిహెచ్‌సిలోనూ, అలాగే 24వవార్డు రేసపువానిపాలెం యుపిహెచ్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె రాజు పాల్గొన్నారు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, సాడి పద్మారెడ్డి, మండల కన్వీనర్లు జివి రమణి, మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పిఎం పాలెం: 6వ వార్డు పిఎంపాలెం యుపిహెచ్‌సిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తగరపువలస:ఒకటో వార్డు చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఉన్న జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 474 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 15 మంది విద్యార్థులు, నలుగురు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు 92 మందికి నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. 474 మందికి మందులు పంపిణీ చేశారు కంటి వెలుగులో భాగంగా 52 మందికి కళ్ళ జోళ్లు అందజేశారు

ఆరిలోవ : 10వ వార్డు పరిధి ఆదర్శనగర్, 26వ సచివాలయం పరిధి ఎంఎస్ఆర్ లేఅవుట్, యుపిహెచ్‌సి ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో పరిశర ప్రాంతాల నుంచి స్థానికులు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు యుగంధర్, ఫణి, దేవి, యు.వి.రమణ, బీజపు పైడిరాజు, కన్నబాబు పాల్గొన్నారు.

స్థాయీ సంఘంలో అన్ని అంశాలూ ఆమోదం



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 52 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండా అంశాలను పొందుపరచగా మొత్తంగా 56 అంశాలను స్థాయీ సంఘ సభ్యులు చర్చించి ఆమోదించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.11.16 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు సందర్భాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికుల ఏర్పాటు కోసం సుమారు రూ.44.06 లక్షలు, క్రీడా విభాగానికి సంబంధించి సుమారు రూ.44.60 లక్షలు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల ప్రొబేషన్, సర్వీస్ స్పెషల్ ఇంక్రిమెంట్లు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలనూ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, ఏడో జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఎఎంఒహెచ్ సిహెచ్.సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో మేడివాడ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక విలేకరులతో రామారావు మాట్లాడుతూ, మేడివాడ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న మోపాడ భాగ్యశ్రీ అండర్ 14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో, సాఫ్ట్‌బాల్, పరుగు పందెం విభాగంలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు, అండర్ 17 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీలకు 10వ తరగతి చదువుతున్న ప్రవీణ్ ప్రకాష్, అండర్ 14 రగ్బీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 8వ తరగతి చదువుతున్న ఎస్.లిఖిత ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, రమణాజి, అప్పలనాయుడు, నాగేశ్వరరావు, మహాలక్ష్మి నాయుడు, పాపారావు, బాలరాజు, కష్టవేణి, అన్నపూర్ణ, పద్మావతి, శ్యామలత, శాంతి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

హెటిరో పైపులైన్‌ను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో డ్రగ్స్ యాజమాన్యం చట్టాలను ఉల్లంఘించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు .కొత్త పైపులైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహా ధర్నా 690వ రోజుకు చేరింది. శుక్రవారం శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైను వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, న్యాయ స్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగా హెటిరో డ్రగ్స్ యాజమాన్యం చట్టాలను ఉల్లంఘించి, పైపులైను వేయడానికి పూనుకోవడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మాజీ ఎంపిటిసి పి.తాతీలు, నాయకులు జి.సోమేశ్వరరావు, వి.నూకరాజు, సిహెచ్ సోమేష్, ఎం.మహేష్ బాబు, పి.స్వామి, ఎం.బాపూజీ, బి.నూకరాజు, బి.అప్పలరాజు, కె.కాశీరావు, డి.వీర్రాజు, ఎం.నరేష్ పాల్గొన్నారు.

108 సర్వీసులను అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి పరిధిలో 108 అంబులెన్స్‌లను రోగులకు అందుబాటులో ఉంచాలని నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ నాయకులు నేతల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు సకాలంలో 108 అంబులెన్సు అందుబాటులో లేక పోవడంతో ఎంతో మంది బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు, తీవ్ర అస్వస్థకు గురైన ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారికి అత్యవసరంగా ప్రాథమిక వైద్య సేవలు అందించడంతో పాటు బాధితులను సత్వరమే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లటానికి మాత్రమే 108 అంబులెన్స్‌లను వినియోగించాలన్నారు. ఏరియా ఆసుపత్రి, సిహెచ్సిలు, పిహెచ్సిల నుంచి సాధారణ రోగులను కూడా విశాఖ తరలించడానికి 108 అంబులెన్స్ వాడుతున్నారన్నారు. దీంతో మండలాల్లో 108 వాహనాలు అందుబాటులో ఉండని పరిస్థితి ఉందన్నారు.

అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి -కోటవురట్ల:అర్హులైన గిరిజనులకు త్వరితగతిన భూ పట్టాలు అందజేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట జయరాం ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి గిరిజనులకు పంపిణీ చేయాల్సిన భూపత్రాలపై ఆరా తీశారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసి అందజేయాలని సూచించారు. కార్యాలయంలో బూత్ లెవిల్ అధికారులు చేపడుతున్న విధుల పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫారం 6,7 వివరాలపై పోలీసు అధికారులు సమాచారం సేకరించారా అని ఆరా తీశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మూడవ విడత రీ సర్వే చేపడుతున్నామని ప్రస్తుతం 88 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని, ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల అయినట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇంతవరకు 1250 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. అసైన్డ్ భూముల పూర్తిస్థాయి భూహక్కు రైతుల ఎంపికపై స్థానిక విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ, అసైన్డ్ భూమి వ్యవహారానికి సంబంధించి వారసులకు మాత్రమే హక్కు కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 4582 ఎకరాల అసైన్డ్ భూములు గుర్తించామని, పందూరు, కైలాస పట్నం, పీకేపల్లి, బోడపాలెం, చౌడవాడ, గ్రామాలలో అత్యధికంగా ఉన్నట్లు తెలిపారు. పందూరు గ్రామంలో జోగిపాలెం దళితులకు పునరావాసం కల్పిస్తూ గతంలో కేటాయించిన భూమిపై అందిన ఫిర్యాదుల పట్ల విచారణ చేపట్టామని సమగ్ర విచారణ చేపట్టి జిల్లా స్థాయి అధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకమ్మ, సీనియర్ అసిస్టెంట్ గణపతిరావు, ఆర్ఐ పూర్ణధరావు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ:ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్సై నారాయణరావు తెలిపారు. గొలుగొండ మండలం రావణాపల్లి గ్రామ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చింతపల్లి నుండి నర్సీపట్నం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం పోలీసులను చూసి తప్పించుకునే క్రమంలో పట్టుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగుల్లో తనిఖీ చేయగా 21 కేజీల గంజాయి లభ్యమైందని, గంజాయితో పాటు, బైక్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.



పట్టుబడిన గంజాయి

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవార రోలుగుంట మండలం నిండుగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ 2వేల జనాభా ఒక్క సచివాలయంను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పరిపాలన అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతన్నను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలుగుల అర్జున్‌రావు, మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట, కొత్త ఎల్లవరం గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఖరీఫ్ పంట తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయ కూలీలను, రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మేకా సత్యనారాయణ, జి.రాధాకృష్ణ, మేకా భాస్కరరావు, సియాద్రి వాసుదేవరావు, పందిరి రాజుబాబు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:పిఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ కార్యవర్గ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల యుటిఎఫ్ అధ్యక్షులు జవ్వాది నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల పిఎఫ్ సొమ్మును ప్రభుత్వం ఎటువంటి అనుమతులు లేకుండా కాజేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు గాయత్రి, కోటవురట్ల గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు లావరాజు, ప్రసాద్ ,సంతోష్, చిట్టయ్య, అప్పలరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం పోరాటం

ప్రజాశక్తి-మాడుగుల:అధికార పార్టీ వీడి న్యాయం కోసం పోరాడడానికి జనసేనలో చేరానని ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. మండల కేంద్రంలో మాడుగుల జనసేన నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే పట్టించు కోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు రాయపురెడ్డి క్రిష్ణ, వీర మహిళ విభాగం నేత వీర సురేఖ, జన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వరిలో వచ్చే తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని శుక్రవారం జి జగన్నాధపురం, గుల్లిపాడు, డొంకాడ గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వరి పొలాలను పరిశీలించారు. ఆకు ముడత తెగులు నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరిలో ఆకుముడత పురుగు చాలా ఉధృతంగా ఉందని, వెంటనే రైతులు యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు.మందు పిచికారి చేయడానికి ముందుగా పొలానికి అడ్డంగా తాడుని లాగడంతో ఆకు ముడతలలో ఉన్న పురుగు రాలుతుందన్నారు. పొలంలో నీటిని పూర్తిగా తీసివేసి సాయంత్రం సమయాలలో వరి చేను పిచికారి చేయడంతో అధిక శాతం పురుగుని నియంత్రించవచ్చున్నారు. ఇంతవరకు మందు పిచకారి చేయని రైతులు క్లోరోపైరిఫాస్ మందు ఎకరాకు 500 మిల్లీలీటర్లు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పొడిమందు ఎకరాకి 400 గ్రాములు పిచికారి చేయాలని సూచించారు . ఇప్పటికే ఒకసారి ఆకుముడత పురుగు నివారణకు మందు కొట్టి పురుగు ఉధృతి అధికంగా ఉన్న పరిస్థితుల్లో ఎమామెక్టిన్ బెంజోయేట్ పొడిమందు ఎకరాకు 80-100 గ్రాములు చొప్పున లేదా ఫ్లూ బెండమైడ్ ఎకరాకు 40-50 మిల్లీలీటర్లు లేదా క్లోరాంట్రినిలిప్రోల్ (కోరాజిన్) ఎకరాకు 60-80 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు . బెట్టు పరిస్థితులు వున్న పొలాల్లో 13-0-45 మల్టీ కే, 19:19:19 ఎకరానికి ఒక కేజీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడంతో ఒకటి ,రెండు వారాలు పాటు వరి పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సురేంద్ర, రజిత, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది